# గుణపాఠం

శంకరం సంగతి మీకు తెలుసో తెలియదో కాని వాడంతటి అల్లరివాడూ లేడు- తెలివైనవాడూ లేడు. క్లాసులో అందరిలోకల్లా అల్లరిచేసేదీ వాడే - అందరిలోకల్లా ఫస్టు మార్కులు తెచ్చుకొనేదీ వాడేనంటే మీకందరికీ ఆశ్చర్యంగా ఉండికదూ? నిజమే మరి. సాధారణంగా అల్లరిచేసే పిల్లలు సోమరులై సరిగ్గా చదవరనికదూ వాడుక. అందుకనే మీకు ఆశ్చర్యంగా ఉంటుంది. శంకరంలోవున్న ఈ ప్రత్యేకతకు మాస్టార్లు కూడా ఆశ్చర్యపడేవారు. దాంతో శంకరం ఎన్ని అల్లరి పనులుచేసినా పరిసిపోతుండేది. శంకరం అల్లరి చిల్లరి పనులవల్ల అవమానం పొందిన మాస్టార్లు వాడికి గుణపాఠం చెప్పాలని ప్రయత్నించారు. కాని, అదేం సాగనివ్వాలా శంకరం. శంకరం ఆ తరగతి కంతకీ నాయకుడయ్యాడంటే-వాడి శక్తిసామర్థ్యాలగురించీ తెలివితేటల్నిగురించీ ఇంక చెప్పాల్సిం దేముంది.

ఒకరోజు ఏమైందనుకున్నారూ, మామూలుగా ఆ పిరియడ్ మాస్టారు వచ్చి కుర్చీలో సరిగ్గా కూర్చున్నారో లేదో 'పాం'అన్న శబ్దంతో మాస్టారు అదిరిపడి, కంగారుగా కుర్చీలోంచి లేచి అమాంతంగా ఒక్క గంతేసేప్పటికి, ఖర్మంచాలక ఓ కాలు అరటితొక్కమీద పడడం, జర్రున జారి క్రిందపడడం అన్నీ ఒక్క క్షణంలో జరగడంతో క్లాసులోని పిల్లలు గొల్లుమన్నారు. “అయ్యో...పాపం!......పడ్డారా మాస్టారూ” అంటూ శంకరం మాస్టారికి చేయూత ఇచ్చి లేవదీశాడు.

పిల్లల పకపకలు మాస్టార్ని పిచ్చెక్కించినంత పని చేశాయి. ఆయనముఖం కందగడ్డలాఅయింది. కళ్లు కూడా ఎర్రబడ్డాయి. ఒక్క నస్యం పట్టు గట్టిగా ముక్కుపుటాల్లోకి దట్టించి, పేకబెత్తం చేతిలోకి దీసికొని, పళ్లు పటపట కొరుకుతూ, “ఎవరీపని చేసింది...ఊఁ...చెప్పరేంరా!” అంటూ గుడ్లురిమారు!

**సింగరాజు లింగమూర్తి**

మాస్టారి నరసింహావతారం చూసి అంతా గప్‌చిప్‌గా కూర్చున్నారు.

“నేనిట్టా అవుతుం దనుకోలేదు మాస్టారూ! - తమాషాకని సైకిలు హారన్ తీసి మీరు వచ్చేముందు కుర్చీలో పెట్టాను”అంటూ శంకరం చేతులు ముడుచుకుని నిలబడ్డాడు.

“ఓరి పిడుగా - నీవేనా? పైగా ఓదారుస్తూ లేవదీశావే?..తమాషా చూద్దాం అనుకున్నావా తమాషా? నాతో నీకు తమాషాలటరా? పట్టు......చెయ్యి పట్టు” అంటూ ఛెళ్లు ఛెళ్ళున రెండేసి దెబ్బలు వడ్డించి, ‘స్టాండు ది బెంచి’ అన్నారు మాస్టారు. ‘అలాగే సార్’ అంటూ శంకరం వచ్చి, ‘ఒరేయ్ విశ్వం... శాస్త్రి నువ్వుకూడా సాయంచేయరా బెంచీ ఎత్తడానికి’ అన్నాడు. శంకరం, చరచర విశ్వం, ఇద్దరూ బెంచీని పైకెత్తి నిలబడ్డారు. క్లాసులో పిల్లలంతా మళ్లీ గొల్లుమని నవ్వారు. మాస్టారికోపం మరి మూడింతలైంది.

“ఉండండి హెడ్ మాస్టారిని పిలుచుకొచ్చి మీ రోగం కుదిరిస్తా” నంటూ గోచి సర్దుకొని తలపాగా, కోటూ సవరించుకొంటూ చకచక వెళ్లబోయేప్పటికి కాలు బెణికిందేమో తొందరగా నడక సాగనివ్వలేదు. అట్లాగే కాలు పట్టిపట్టివేస్తూ వెళ్లారు. “హెడ్‌మాస్టారు వచ్చి, పేకబెత్తంతో అందరికీ తలోటి వడ్డించుతారేమో” అనుకున్నారు పిల్లలంతా-ఇంతలో హెడ్మాస్టారు రానేవచ్చారు-పేకబెత్తంతో. అప్పటికికూడా శంకరం, విశ్వం ఇద్దరూ బెంచీ పైకెత్తి పట్టుకునేవున్నారు. “ఏమిటిదంతా ?” అని గర్జించారు హెడ్మాస్టారు. ఎవరూ కిక్కురుమనలేదు. “మాస్టారు స్టాండు ది బెంచి అన్నారు సార్-అందుకని” అంటూ శంకరం ఇంకా చెప్పబోతుండగానే హెడ్మాస్టారికికూడా పట్టరానినవ్వు వచ్చింది. కానీ, అది పైకి పొక్కనీయకుండా, “చాలించండి! బెంచీదించి కూర్చోండి” అన్నారు. కొడతారనుకున్న హెడ్మాస్టారు కాస్తా నవ్వుకుంటూ, క్లాసులోంచి వెళ్లిపోయారు. మాస్టారు తెల్లముఖం వేసి, హెడ్ మాస్టారు వెళ్లినవంకే చూస్తూ నిలబడేప్పటికి “మాస్టారూ కాలు బెణికిందా ?”అని పరామర్శించాడు శంకరం. క్లాసులో మళ్లీ నవ్వులు ప్రారంభమైనాయి. శంకరం పరామర్శ, పిల్లల నవ్వులు పుండు

# గుణపాఠం

మిరపకారం చల్లినట్టయింది మాస్టారికి. తనను నలుగురిలో యెద్దేవా చేయడానికే శంకరం అలా కొంటెగా అడిగాడనుకున్నారు మాస్టారు. ఆ సమయంలో ఎవరైనా అలాగే అనుకుంటారు. కాని శంకరం మాత్రం 'పాపం, మాస్టారికి దెబ్బ తగిలిందే' అన్నభావంతోనే పరామర్శించాడు.

మాస్టారు ఒకసారి గుడ్లురిమి, జాగ్రత్తగా ఒకసారి కుర్చీవంక చూసుకొని కూర్చున్నారు. రెండు మూడు నిమిషాలు గడిచాయి.

“ఒరేయ్ శంకరం-ఇలా రా' అని మాస్టారు పిలిచారు. ఆ పిలుపులో కటుత్వం లేదు. ఆయనముఖం కూడా ప్రశాంతంగా వుంది. ఇంతసేపూ పిల్లలంతా అల్లరి చేస్తున్నా ఏమీ మాట్లాడకుండా చూస్తూ కూర్చున్న మాస్టారు ఉండి ఉండి శంకరాన్ని దగ్గరికి రమ్మని పిలచేప్పటికి ఏమి జరుగుతుందో అనుకున్నారు కొందరు. శంకరాన్ని చావ కొట్టి చెవులు మూస్తారనుకున్నారు కొందరు. శంకరం మాత్రం ఏమనుకున్నాడో యేమో కాని కిమ్మనకుండా మాస్టారిదగ్గిరికి పిలవంగానే వెళ్ళి నిలబడ్డాడు.

“నీకు ఫుట్ బాల్ ఆడటం వచ్చు కదరా శంకరం?” అని మాస్టారు నవ్వుతూ అడిగేప్పటికి శంకరానికి ఎక్కడలేని ఆశ్చర్యం,సిగ్గూ వేసింది. “మాస్టారెంతో కోప్పడి కొడతారనుకున్నాడు తను. కాని ఇలా నవ్వుతూ మాట్లాడుతున్నారే! అందులో ఈ మాస్టారికి ఫుట్ బాల్ ఆటసంగతెందుకు?” అని ఆలోచిస్తున్నాడు శంకరం.

“ఏంరా మాట్లాడవేం? ఫుట్ బాల్ ఆడటం వస్తుందికదూ?” అని మాస్టారు మళ్ళీ అడిగేప్పటికి వస్తుందన్నట్లుగా తలూపాడు శంకరం. “హైజంప్ కూడా చేస్తావుకదూ?” అన్నారు మాస్టారు.

'ఏమిటీ ప్రశ్నలు - ఎందకూ అడుగుతున్నారు' అనుకుంటూనే మాస్టారువంక చూస్తూ నెమ్మదిగా 'అవునండీ' అన్నాడు శంకరం.

“ఆటలోనైనా, దూకడంలోనైనా పడిపోతావనుకో - అప్పుడేమౌతుంది? కాలికి దెబ్బతగలదూ? అని మాస్టారనేప్పటికి శంకరానికి వెనుక తను ఫుట్ బాల్ ఆడుతూ పడిపోవడం, కాలికి దెబ్బతగలడం, కాలు బెణికి మూడు నాలుగు రోజులు చాలా బాధపడి కుంటుకుంటూ నడవడం అంతా జ్ఞాపకం వచ్చి, “నిజమే మాస్టారూ... దెబ్బ తగిలి చాలా బాధ పెడుతుంది” అన్నాడు. “అప్పుడు నిన్ను చూసి నవ్వితే నీకెలా వుంటుంది?”అన్నారు మాస్టారు. ఇక శంకరం ఏమీ మాట్లాడలేకపోయాడు.

'మాస్టారు ఎంత చక్కగా గుణపాఠం చెప్తున్నారు. తను సైకిల్ హారన్ కుర్చీలో పెట్టకుండావుంటే మాస్టారు ఎగిరి గంతేసేవారు కాదుగా. ఎగిరి గంతెయ్యబట్టేగా కాలు అరటిపండు తొక్కమీద పడి జారి క్రింద పడింది' అనుకుంటున్నాడు శంకరం.

“ఏమిటి ఆలోచిస్తున్నావు?” అన్నారు మాస్టారు. శంకరం ఏమీ మాట్లాడలేక తల వంచుకున్నాడు.

“పిచ్చివాడా-నీవు చేసిన పనిని గురించే ఆలోచిస్తున్నావుకదూ.. నాకిప్పుడు కాలు బెణికిందేఅనుకో- అది తగ్గక చాలా బాధపెట్టి కాలు సగంవరకు తీసివేయాల్సి వస్తుందనుకో - అప్పుడు నేను ఉద్యోగం ఎలా చేయగల్గుతాన్రా ?” అని మాస్టారు ఇంకేమో చెప్పబోతుండగానే శంకరం కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి. వాడి హృదయం పశ్చాత్తాపంతోనూ సిగ్గుతోనూ కుతకుతలాడింది.

“క్షమించండి మాస్టారూ - ఇంకెప్పుడూ ఇటువంటి అల్లరి పనులు చేయను” అంటూ లెంపలు వేసుకున్నాడు. ఇంతలో గంటకొట్టడంవల్ల బడి వదిలారు. ఆ రోజునుంచీ శంకరం స్కూలు జీవితంలో ఎప్పుడూ అల్లరివాడనిపించుకోలేదు. తోటి విద్యార్థులకు అన్నిటా ఆదర్శప్రాయుడైనాడు. చూశారా? చిత్రం!

---

తండ్రి చిన్నకొడుకును వెంటబెట్టుకుని జంతుప్రదర్శనశాలకి తీసుకువెళ్ళి వింత జంతువులన్నిటినీ చూపిస్తున్నాడు. కొడుక్కి ఏదో భయంకరమైన ఆలోచన వచ్చి నిలబడిపోయాడు:

“నాన్నా! ఆ సింహం బోనులోంచి తప్పించుకుని బయటికొచ్చి నిన్ను మింగేస్తుందనుకో. అప్పుడు మనింటికి ఏ నంబరు బస్సులో వెళ్లాలో ఎలా తెలుస్తుంది నాకు?”

Printed and Published for Nageswara Rao Estates Ltd., by S. Radha Krishna at The Andhra Patrika
... Editor S. Sambhu Prasad.